"ఏమండీ. ఈ వార్త మీకు తెలిసిందా?" ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి చేరుకున్న రామ్మూర్తితో అంది జయ.

"ఏం వార్త?" ఆసక్తిగా అడిగాడు.

"జగ్గారావు పార్టీ వదిలి కొత్త పార్టీలో చేరిపోయాడు.

ఇందాక టీ.వి. వార్తల్లో చెప్పారు"

"ఏ పార్టీలో?"

"అదే ఆశ్చర్యంగా ఉంది! మతాన్ని చాటుచేసుకుని పెట్టిన పార్టీలో చేరాడు" విచారంగా అంది జయ.

# పొగడరా నీ తల్లి భూమి భారతిని

డా|| టి. సంపత్ కుమార్



రామ్మూర్తికి ఆ వార్తను వినగానే మరింత అలసిపోయినట్లనిపించింది. కళ్ళు మూసుకొని సోఫాలో కాస్త ముందుకు జరిగి టీపాయ్‌పై కాళ్ళను మోపాడు.

తాను చెప్పవలసిందేదో చెప్పేసిన జయ కాఫీ తీసుకురావడానికి కిచెన్‌కు దారి తీసింది.

రామ్మూర్తి నుదుట ముడతలు పడుతున్నాయి. కళ్ళు మూసుకొనే ఉన్నాడింకా. చేతుల్ని పైకెత్తి తల వెనక్కి పోనించి వేళ్ళలో వేళ్ళు జొనిపి ఆ అల్లికలో తలను వదిలంగా ఉంచాడు.

"జగ్గారావు ఎంతపని చేసాడూ... ఇలా చేయాల్సింది కాదు... తొందరపడి నిర్ణయం తీసుకున్నట్టున్నాడు... ఛ....ఛ... ఎంత నాయకుడైనా ఇంత కక్కుర్తి పడి ఉండాల్సింది కాదు.... రాజకీయాల్లో రంగులు ఎంత వేగంగా మారుతాయీ...." రామ్మూర్తి మనసు ఆలోచనలతో నిండిపోయింది.

జగ్గారావు రాజకీయాల్లోకి ఎలా ప్రవేశం చేశాడో.... ఎలా పెరిగి పోయాడో.... ఒక్కొక్క సంఘటనా మెల్లగా జ్ఞాపకానికొచ్చాయి.

రామ్మూర్తి, జగ్గారావులు చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆ స్నేహం ఇంకా కొనసాగుతోంది. జగ్గారావు చిన్నపుడు అన్యాయాన్ని సహించేవాడు కాదు. ఆ గుణమే అతన్ని మిత్ర బృందంలో పెద్దమనిషిని చేసింది. స్కూలు జీవితంలో మిత్రుల మధ్య ఏ చిన్న గొడవొచ్చినా జగ్గారావు చెప్పిందే సుప్రీంకోర్టు తీర్పు. ఎవరూ

అసంతృప్తి పడేవారు కాదు. అంత తులనాత్మకంగా ఉండేది అతని తీర్పు. అదేమి చిత్రమో కాని వాళ్ళ బృందంలో అన్ని మతాల వాళ్ళూ ఉండేవాళ్ళు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్స్... ఇలా మూడు మతాల వాళ్ళూ మతం అంటే ఏమిటో తెలియనప్పటి నుండీ కలిసి పెరిగారు. ఎనిమిదవ తరగతిలో ఒక సిక్కులబ్బాయి వాళ్ళ క్లాసులో, వాళ్ళ బృందంలో చేరడంతో దానికి మరింత నిండుతనం వచ్చింది.

జగ్గారావు చిన్నప్పటి నుంచి ఒకే కన్నుతో చూడగలిగేవాడు. రెండో కన్ను చూడ్డానికి మామూలుగానే ఉన్నా దృష్టిలోపంతో చూడలేకపోయేవాడు. అపుడపుడు జగ్గారావును మిత్రులు తమాషా పట్టించేవారు, "ఒక్క కన్నుతోనే నీవు మాకు నాయకుడవయ్యావు. రెండు కళ్ళుంటే దేశానికి ప్రధానమంత్రివైపోతావని" దీనికి జగ్గారావు కోపం తెచ్చుకోకుండా చిరునవ్వు నవ్వే వాడు.

చిన్న బృందంలో మొదలైన నాయకత్వ లక్షణాలు క్రమేణా ప్రస్ఫుటంగా బహిర్గతం కావడంతో మెల్లమెల్లగా జగ్గారావు తన పరిధిని విస్తరించడం మొదలుపెట్టాడు. చిన్న మిత్రుల గుంపు నుండి పూర్తి క్లాసుకు, పూర్తి క్లాసు నుండి స్కూలుకు, స్కూలు నుండి వీధికి... ఇలా.... ఇలా.... పెరిగి జిల్లా స్థాయి నాయకుడిగా పరిణామం చెందాడు. మంచి పనులు చేస్తూ పేరు సంపాదించినా, వాసనలేని పువ్వుకు ఆదరణ దొరకదని పించి ఓ రోజు ఓ రాజకీయ పార్టీలో చేరిపోయాడు. సెక్యులర్ భావాలు గల పార్టీలో చేరినందుకు మిత్రులు, శ్రేయోభిలాషులంతా సంతోషించారు. ఆ పార్టీక్కూడా జగ్గారావు లాంటి రెడీమేడ్ సభ్యుడు దొరకడంతో బలం చేకూరింది. తక్కువ కాలంలోనే ముఖ్యమైన వారి మన్ననలకుపాత్రుడై ఒక కీలకమైన వ్యక్తిగా రోజు రోజుకూ తన ప్రాముఖ్యతను పెంచుకున్నాడు.

ఒక రోజు పార్టీ తరఫున నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించే బాధ్యతల్ని జగ్గారావుకు అప్పజెప్పారు. దాన్ని జగ్గారావు ఎంతో సమర్థవంతంగా నిర్వహించాడు. దినమంతా కంటి పేషెంట్లను గమనించిన జగ్గారావుకు తన కన్నునూ చూపిస్తే బాగుంటుంది అనిపించింది. సాయంత్రం సమయం చిక్కించుకొని తన కన్నును పరీక్ష చేయించాడు. కార్నియాలో లోపముందని, మరో కార్నియాతో మామూలు దృష్టిని తీసుకురావచ్చని తెలిపి హైదరాబాద్ రమ్మని సలహా ఇచ్చారు డాక్టర్లు.

రాజకీయాల్లో ఎదిగిపోతున్న జగ్గారావుకు ఒక కన్ను దృష్టి సరిగా లేకపోవడం ఎందుకో అసౌకర్యంగా అనిపించడం ఆరంభమయ్యింది. ఓ రకమైన న్యూనతా భావం అతన్ని వెంబడించసాగింది. ఇక భరించలేక ఒక రోజు హైదరాబాద్ చేరుకున్నాడు. పార్టీ ప్రముఖుల పలుకుబడితో పనులను చకచకా చేయించుకున్నాడు. వేరే కార్నియా పెట్టించుకొని చక్కని చూపును తెచ్చుకున్నాడు. అతను హాస్పిటల్లో ఉన్నన్ని రోజులు ఉద్యోగరీత్యా హైద్రాబాద్‌లో ఉన్న రామ్మూర్తి జగ్గారావును బాగా చూసుకున్నాడు.

జగ్గారావులో మరిన్ని మార్పులొచ్చాయి. పార్టీ కోసం చాలా కష్టపడసాగాడు. ర్యాలీలైనా, ఘెరావ్‌లైనా, మీటింగ్‌లైనా... అన్నింటిని విజయవంతం చేయసాగాడు. పార్టీలో ప్రాముఖ్యత పెరుగుతూ పోయింది. పేరు ప్రఖ్యాతులు జగ్గారావు మకాంను హైదరాబాద్‌కు మార్పించాయి. మరి కొంత కాలంలో తన ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టాడు.



"ఈరోజు అరలీటరు పాలే పోస్తున్నావా? ఎందుకని? గేదెలు పాలు తక్కువ ఇచ్చాయా?"

"లేదమ్మా! నిన్నటి నుంచి మా కాలనీ వాటర్ ట్యాంక్ చెడిపోయింది". వినయంగా జవాబిచ్చాడు పాలవాడు.

కె.అరుణ్‌కుమార్, కరవడి

హైదరాబాద్‌కు మకాం మారడంతో జీవితం చాలా బిజీగా మారింది. దానికి తగ్గట్టు ఎమ్మెల్యే కావడంతో అలవాట్లు మారాయి. నడవడిక మారింది. తిండి తిప్పలు మారాయి. శరీరానికి సుఖం ఎక్కువైంది. శరీరాంగాలు ప్రతిపక్ష పార్టీ వారిలాగా మేము నీతో సహకరించమన్నట్టుగా అప్పుడప్పుడు తమ ప్రాముఖ్యతను తెలియజేశాయి. స్పెషలిస్టులకు చూపిస్తే ఆలస్యమయ్యిందని అన్నారు. మూత్రపిండాన్ని మార్చాలన్నారు.

పలుకుబడి, రాజకీయాన్ని మిళితం చేసి చివరకు మూత్రపిండాన్ని అమ్మే ఓ పేదవాడ్ని పట్టుకున్నారు. డబ్బు కట్టలపైన "దాత" అన్న మేలిముసుగు కప్పి పూరిగుడిసె నివాసి మూత్రపిండాన్ని పంచ నక్షత్రాల జగ్గారావు శరీరంలో మకాం పెట్టించారు. జగ్గారావు హాస్పిటల్లో చేరినప్పటినుండి దాతను వెతకడంలో,



పని మనిషిని అడిగింది పద్మ.

"వాసే రంగీ... ఇవాళ మీ ఆయన నిన్ను బాగా తిట్టాడు కదే".

"అవునండి"

"కొట్టడానికొచ్చాడు కూడా కదూ?"

"ఔనండమ్మగారూ. మీకెట్లా ఎరికయిందండీ?"

"ఇడ్లీ పప్పు మెత్తగా రుబ్బితేనూ" చెప్పింది.

పద్మశ్రీ [మాణిక్యారం]

లావాదేవీలూ రాయబారాలూ జరపడంలో రామ్మూర్తి కీలకమైన పాత్ర వహించాడు. జయ కూడా జగ్గారావు భార్యకు తోడుగా ఉంటూ కొండంత ధైర్యాన్నిస్తూ పెద్దండగా నిలచింది.

నాలుగేళ్ళు గడిచాయి. జగ్గారావు మరింత పాపులర్ అయ్యాడు. పార్టీ పెద్దల మన్ననలను సంపాదించి మంత్రయ్యాడు. జీవితం సంక్లిష్ట యంత్రంలా తయారయ్యింది. పనులెక్కువయ్యాయి. దినం చిన్నదైంది. శరీరం బరువైంది. కార్లు... అంగరక్షకులు... ఎంతో మార్పు వచ్చింది. ముఖ్యమంత్రికి విశ్వాసపాత్రుడయ్యాడు. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం వెనకా జగ్గారావుతో సంప్రదింపులుండసాగాయి. అదే కొన్ని తంటాలను కూడా తెచ్చిపెట్టింది. అతనికి పార్టీలో కొందరు దగ్గరైతే మరికొందరు దూరమయ్యారు.

ఒక రోజు జగ్గారావు ముఖ్యమంత్రి ఇంటి నుంచి రాత్రిపూట తిరిగివస్తోండగా మాటువేసి ఉన్న లారీ ఒకటి మెరుపులా దూసుకొచ్చి జగ్గారావు కారును ఢీకొట్టింది. కారు అష్టవంకర్లు తిరిగింది. అంగరక్షకులు అంగాల్ని కోల్పోయారు. జగ్గారావుకు బాగా గాయాలు తగిలాయి. రక్తాన్ని విపరీతంగా కోల్పోయి స్పృహ తప్పి పడిపోయాడు.

రక్తరీత్యా జగ్గారావు అరుదైన వ్యక్తి. ఆయన రక్తం 'ఓ' గ్రూపు. అందులోనూ ఆర్.హెచ్. నెగెటివ్. బ్లడ్ బ్యాంకులో నిలువ ఉన్నది సరిపోలేదు. టీవీలో ప్రకటించాల్సి వచ్చింది. రామ్మూర్తి జోక్యంతో పనులు తొందరగా జరిగాయి. జగ్గారావు మామూలు మనిషయ్యాడు. రాజకీయాలు పుంజుకున్నాయి.

పార్టీ సభ్యుల మధ్య పెరిగిపోతున్న ఏవగింపులు, గ్రూపుల మధ్య రగులుకుంటున్న కక్షలు, కులాలవల్ల ఉద్భవిస్తున్న నూతన సమస్యలను భరించలేని ఆ సెక్యులర్ భావాల పార్టీ నిలువునా చీలింది. నడ్డి విరిగింది. అధికారం మరిగిన జగ్గారావు మనసులో ఓ మూలన ముఖ్యమంత్రి కావాలన్న ఆశ ఏనాడో గూడు కట్టుకుంది. అదనుకోసం ఎదురుచూస్తోన్న జగ్గారావు మతాన్ని ముసుగులో దాచుకున్న పార్టీలో చేరాడు. అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్న ఆశ కొత్త పార్టీ పట్ల మోజును పెంచుకొని కౌగిలించుకునేట్లు చేసింది.

ఈ వార్తే ఇప్పుడు రామ్మూర్తిని కలవరపరుస్తోంది.

మెల్లగా కళ్ళు తెరిచి చూసాడు. జయ ఎప్పుడో పెట్టి వెళ్ళిన కాఫీ చల్లబడిపోయింది. అలసటను తీర్చడానికి ఆ వేడి చాలదని ఉంచి జయను పిలిచి వేడి కాఫీ ఇవ్వమన్నాడు. బాత్రూమ్‌కు మొఖం కడుక్కోడానికి వెళుతూ జగ్గారావు ఇంటి కెళదామనీ, రడీ కమ్మనీ జయతో చెప్పాడు.

రామ్మూర్తీ జయా వెళ్ళేసరికి జగ్గారావు ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తున్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను చేరిన పార్టీయే దేశ సమస్యలను నివారించగలదనీ, వికాసానికి పునాది వేయగలదనీ ఉద్వేగంతో చెబుతున్నాడు. పక్క రూమ్‌లోనే కూర్చున్న రామ్మూర్తికి ఇవన్నీ వినబడుతున్నాయి.

జర్నలిస్ట్ నిష్క్రమించగానే రామ్మూర్తి జగ్గారావు గదిలోకి ప్రవేశించాడు. పొంగివస్తున్న ఉద్రేకాన్ని అణచుకునే ప్రయత్నం చేస్తోండగా జయ, జగ్గారావు భార్య కూడా అక్కడికి చేరుకున్నారు. వీళ్ళందరి ముందు జగ్గారావు తప్పు చేసిన వాడిలా ముఖం పెట్టాడు. మామూలుగా కనబడే ప్రయత్నం చేసినా విఫలుడయ్యాడు.

